సాక్షి వనపర్తి

బుధవారం : 6 : నవంబర్ : 2024



ఉత్సాహంగా మ్యాథ్స్‌బీ

'సాక్షి' మీడియా గ్రూప్ నిర్వహించిన మ్యాథ్స్‌బీ పరీక్షకు విశేష స్పందన లభించింది.

వివరాలు 8లో ▸



క్రీడాకారులకు అండగా..

క్రీడాకారులకు అండగా ఉంటామని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం 34.1 /20.9

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత.. రాత్రివేళలో చలి ప్రభావం కాస్త కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

11న సీఎం రేవంత్‌రెడ్డి రాక

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు, జాతర ఉత్సవాలను పురస్కరించుకొని స్వామివారి దర్శనానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం వస్తారని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి మంగళవారం సాయంత్రం కురుమూర్తిస్వామి ఆలయం వద్ద అధికారులతో కలిసి హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. సీఎం రాకకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట సీఐ రామకృష్ణ, ఆలయ సిబ్బంది న్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

వనపర్తిటౌన్: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్ష ఫీజు గడువును ఈ నెల 26 వరకు ప్రభుత్వం పొడిగించినట్లు డీఐఈఓ ఎర్ర అంజయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం రూ.100తో డిసెంబర్ 4 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులకు రూ.520, ఒకేషనల్ రెగ్యులర్ కోర్సులకు రూ.750, ద్వితీయ సంవత్సరం జనరల్, ఆర్ట్స్ కోర్సులకు రూ. 520, ద్వితీయ సంవత్సరం జనరల్ సైన్స్‌కు రూ.750, ఒకేషనల్ కోర్సులకు రూ.750 చొప్పున ఫీజు చెల్లించాలన్నారు.

'కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలి'



వనపర్తి రూరల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఎంసీహెచ్‌లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులతో సమావేశమై సమస్యలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. కార్మికుల కనీస వేతనాలకు నోచుకోక దశాబ్దాలుగా వెట్టికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున పోరాటం చేసి సాధించుకున్న జీఓ అమలు కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో వెలకట్టలేని సేవలందిస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు. అలాగే ఆస్పత్రుల్లో కార్మికులకు భద్రత, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కార్మికులు కవితరాణి, అనిత, ప్రేమకుమారి, మంజుల, మహేశ్వరి, భాగ్యమ్మ, చంద్రకళ, తిరుపతమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో 10 వేల సభ్యత్వాలు : బీజేపీ

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలో 10 వేల సభ్యత్వాలు చేసినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ తెలిపారు. మంగళవారం పార్టీ పట్టణశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు ప్రజలు ఆకర్షితులై పార్టీ సభ్యత్వాలు చేసేందుకు ముందుకొస్తున్నారని వివరించారు. ఆరు రోజులుగా సభ్యత్వ నమోదు కొనసాగుతుందని.. ప్రతి వ్యాపారి సభ్యత్వం చేయించుకునేందుకు ముందుకొస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బి.రాము, నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, అలివేలమ్మ, రామన్‌గౌడ్, ఆర్.వెంకటేశ్వర్‌రెడ్డి, కుమారస్వామి, కృష్ణగౌడ్, రాజేంద్రసాగర్, నవీన్‌చారి, విజయ్, శివ తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం.. తల్లి, బిడ్డ క్షేమం



కొత్తకోట రూరల్: 108 వాహనంలో గర్భిణి ప్రసవించిన ఘటన మండలంలోని కానాయపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. కానాయపల్లికి చెందిన శిరీష పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు 108కు ఫోన్ చేశారు. 108 వాహనంలో గ్రామం నుంచి వనపర్తికి తీసుకెళ్తుండగా.. నొప్పులు అధికంగా కావడంతో సిబ్బంది అత్యవసర చికిత్స అందించారు. మార్గమధ్యంలోనే ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని.. అంబులెన్స్ సిబ్బంది బుద్వేష్, అక్బర్ తెలిపారు. కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

అంతా సిద్ధం

నేటి నుంచి సమగ్ర కుటుంబ సామాజిక సర్వే



వడ్డెవాటలో ఎన్యుమరేషన్ బ్లాక్‌ల గుర్తింపును పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు (ఫైల్)

- జిల్లాలో 1,392 ఎన్యుమరేటర్ బ్లాక్‌లు
- తొలి మూడు రోజులు బ్లాక్‌ల వారీగా కుటుంబాల జాబితా.. ఇంటింటికి స్టిక్కర్లు అంటించే కార్యక్రమం
- 9వ తేదీ నుంచి సర్వే ప్రారంభం

వనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర కుటుంబ సామాజిక సర్వే బుధవారం నుంచి ప్రారంభంకానుంది. ఈ మేరకు ఉపాధ్యాయులకు పలు దఫాలుగా శిక్షణనిచ్చి సంసిద్ధులను చేశారు. బుధవారం నుంచి 8వ తేదీ సాయంత్రం వరకు ఎన్యుమరేటర్ బ్లాక్‌ల వారీగా కుటుంబాల జాబితా సిద్ధం చేస్తారు. ప్రభుత్వం నిర్దిష్ట సంఖ్యతో తయారుచేసిన స్టిక్కర్లను ఇంటింటికి అంటిస్తారు. 9వ తేదీ నుంచి సమగ్ర కుటుంబ సామాజిక, ఆర్థిక, కులగణన చేపట్టనున్నారు.

56 అంశాలతో..

జిల్లాలోని 14 మండలాలు.. 255 గ్రామపంచాయతీల పరిధిలోని కుటుంబాలను 1,392 బ్లాక్‌లుగా విభజించి ప్రతి బ్లాక్‌కు ఒక ఎన్యుమరేటర్‌ను నియమించారు. వారికి కేటాయించిన బ్లాక్‌లలో బుధవారం నుంచి మూడురోజుల పాటు కుటుంబాల సంఖ్యను లెక్కించి ఇంటింటికి స్టిక్కర్లు అంటిస్తారు. 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పదిరోజుల పాటు సామాజిక, ఆర్థిక, కులగణనకుగాను సుమారు 56 అంశాలకు సంబంధించిన వివరాలు సేకరించనున్నారు. మొదట ఈ సర్వేను పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బందితో చేయించాలని నిర్ణయించినా.. లెక్క సక్రమంగా రాదనే ఉద్దేశంతో ఉపాధ్యాయులతో చేయించాలని ప్రభుత్వం నిర్ణయించి వారం రోజులుగా వారికి మండల, డివిజన్, జిల్లాస్థాయిలో పలు దఫాల్లో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి సర్వే చేయాల్సిన విధానంపై తర్ఫీదునిచ్చారు.

ప్రతి పది మందికి ఒక సూపర్‌వైజర్..

జిల్లావ్యాప్తంగా 1,392 బ్లాక్‌లు గుర్తించి ఎన్యుమరేటర్లను సర్వే కోసం నియమించారు. వీరి పనితీరును పర్యవేక్షించేందుకు ప్రతి పది మందికి ఒక సూపర్‌వైజర్‌ను ఏర్పాటు చేశారు. సూపర్‌వైజర్లుగా ఎంపీడీఓలు, ఎంపీఓలు, తహసీల్దార్లు, మండలస్థాయి అధికారులను నియమించారు. ఈ విషయంపై వారం రోజులుగా జిల్లా యంత్రాంగం సీపీఓ, అదనపు కలెక్టర్లను సమన్వయం చేసుకుంటూ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా 1.70 లక్షల కుటుంబాలు..

పెరిగిన జనాభా, కుటుంబాల సంఖ్య ఆధారంగా జిల్లాలోని 14 మండలాల్లో ఉన్న సుమారు 1.70 లక్షల కుటుంబాలను ఎన్యుమరేటర్లు కలిసి ఆర్థిక, సామాజిక, కుల, రాజకీయ తదితర వివరాలు సేకరించనున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ప్రభుత్వ రికార్డుల్లో సక్రమంగా లేవనే కారణం చూపిస్తూ ప్రస్తుత ప్రభుత్వం మరోసారి సర్వేకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది.

సర్వే సిబ్బందికి సహకరించండి

ఎన్యుమరేటర్లకు ఆయా ప్రాంతాల్లోని పంచాయతీరాజ్, మున్సిపల్ సిబ్బంది బ్లాక్, ఏరియా పరిధి చూపించడంతో పాటు పూర్తి సహకారం అందించాలి. బుధవారం ఉదయం వారు సర్వే చేయాల్సిన కుటుంబాలు, ఇళ్లను చూపించి కావాల్సిన సహకారం అందించాలి. ప్రతి ఎన్యుమరేటర్‌కు ఉత్తర్వు కాపీ అందించాలని అధికారులను ఆదేశించాం.

– ఆదర్శ్ సురభి, కలెక్టర్

ఉపాధ్యాయుల సర్వే ఇలా..

సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉదయం 7 నుంచి 9 వరకు సర్వే నిర్వహించారు. ఆ తర్వాత 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాఠశాలకు వెళ్తారు. మధ్యాహ్న భోజన విరామం తర్వాత సాయంత్రం 5 గంటల వరకు చేపట్టిన సర్వే నివేదికను మండల ప్రత్యేక అధికారికి అందజేస్తారు. మిగతా సిబ్బంది ఉదయం 9 గంటలకే సర్వే ప్రారంభించి 10 కుటుంబాలు పూర్తిచేసి మండల అధికారికి నివేదిస్తారు. వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఇతర బలహీనవర్గాల సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ కుటుంబ నేపథ్యం తదితర మొత్తం 75 అంశాల వివరాలు సేకరించనున్నారు.కుటుంబ యజమానితో పాటు సభ్యుల విద్య, ఉద్యోగ, ఉపాధి, కులవృత్తులు, ఆస్తులు, అప్పులు, భూములు, ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన పథకాల వివరాలు, రాజకీయ నేపథ్యం తదితరాలు సేకరిస్తారు.

నేటి నుంచి ఇళ్ల జాబితా..

ఎన్యుమరేటర్లు బుధవారం నుంచి రెండ్రోజుల పాటు ఇల్లిల్లూ తిరిగి ఇళ్ల జాబితా సిద్ధం చేస్తారు. కుటుంబ యజమాని పేరు, చిరునామా తదితర వివరాలు సేకరించి ప్రతి ఇంటికి స్టిక్కర్ అంటిస్తారు. 8వ తేదీ నుంచి 22 వ తేదీ వరకు సర్వే చేపట్టి సమగ్ర వివరాలు సేకరిస్తారు. సర్వే చేపట్టే ప్రాంతంలో ఒకరోజు ముందుగానే చాటింపు వేస్తారని.. అందుబాటులో ఉండి ధ్రువపత్రాలను దగ్గర ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇంటి యజమాని అందుబాటులో లేకపోతే వారి బంధువులు చెప్పినా నమోదు చేసుకుంటారు.

పకడ్బందీగా వరి ధాన్యం కొనుగోళ్లు

అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు

వనపర్తి: వరి ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో ఎఫ్ఏక్యూ నిబంధనలు పాటించాలని, గతంలో చోటు చేసుకున్న పొరపాట్లకు అవకాశం లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా టార్పాలిన్లు, టెంట్లు సిద్ధంగా ఉంచాలని, సన్న, దొడ్డురకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేసి బ్యానర్లు కట్టాలని కోరారు. బుధవారం నాటికి అన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావాలని, సన్న, దొడ్డు రకం ధాన్యం బస్తాలపై ప్రత్యేకమైన మార్కింగ్ ఉంటుందని చెప్పారు. ప్రతి చిన్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని, రైతులు వచ్చిన తేదీలు, సమయం వారీగా కొనగోళ్లు చేయాలన్నారు. సన్నాలకు తేమ శాతం 14 మించకూడదని.. పక్కాగా పరిశీలించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు పూర్తయిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ, ట్రక్ షీట్ పూర్తి చేయడంతో పాటు ఓపీఎంఎస్‌లో నమోదు చేయాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో డీఆర్డీఓ ఉమాదేవి, పౌరసరఫరాలశాఖ డీఎం ఇర్ఫాన్, పౌరసరఫరాలశాఖ అధికారి విశ్వనాథ్, ఏపీఎంలు, ఐకేపీ కేంద్రాల ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగొద్దు

ఆత్మకూర్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం స్థానిక మార్కెట్‌యార్డులో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి విశ్వనాథ్‌తో కలిసి వరి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 379 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, అందులో సన్నరకాల కొనుగోలుకు 262 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే 50 కేంద్రాలు ప్రారంభించి 1,500 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్రాల నిర్వాహకులకు అవసరమైన గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ చాంద్‌పాషా, డీటీ ప్రసాద్‌ను ఆదేశించారు.

ఉపాధి పనులు సిద్ధం చేయాలి : డీఆర్డీఓ



ఉపాధి సిబ్బందికి సూచనలిస్తున్న డీఆర్డీఓ ఉమాదేవి

వీపనగండ్ల: ఉపాధి కూలీలకు పనులు కల్పించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డీఆర్డీఓ ఉమాదేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో చిన్నంబావి, వీపనగండ్ల మండలాల ఉపాధి సిబ్బందితో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను పనులు గుర్తించి వాటిని గ్రామపంచాయతీ రికార్డుల్లో తప్పని సరిగా నమోదు చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్ల పెండింగ్ బిల్లులు లబ్ధిదారులకు వెంటనే ఇప్పించేందుకు ప్రయత్నించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి పనులు చేసినా బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అడిషనల్ డీఆర్డీఓ నాగేంద్రం, ఏపీడీ సుల్తాన్, ఎంపీడీఓలు శ్రీనివాసరావు, రమణారావు, ఎంపీఓ రామస్వామి, ఏపీఓ శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

హాస్టల్‌లో వసతులు కల్పించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ బాలికల హాస్టల్‌లో వసతులు కల్పించాలని మంగళవారం రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డికి ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఒక్క గదిలో 8 నుంచి 10 మంది విద్యార్థులు ఉంటున్నారని, తాగునీరు సరిగా అందడం లేదని, అన్నం, కూరగాయలు నాసిరకంగా ఇస్తున్నారని ఆరోపించారు. స్పెషల్ ఫీజుల పేరిట రూ.1,800 ఎందుకు వసూలు చేస్తున్నారని అడిగితే సమాధానం చెప్పడం లేదన్నారు. రాత్రిళ్లు స్ట్రీట్ లైట్లు వెలగడం లేదని చెప్పారు. ఆయా సమస్యలు వెంటనే పరిష్కరించాలని వినతిలో కోరారు.

నాసిరకం మందులు విక్రయిస్తే చర్యలు



నాగల్‌కడ్మూర్‌లో ఆరబోసిన వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌నాయక్

అమరచింత: ఫర్టిలైజర్ దుకాణదారులు రైతులకు నాసిరకం పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవింద్‌నాయక్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని నాగల్‌కడ్మూర్, ఈర్లదిన్నెలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి నిల్వ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల శివారుల్లోని రైతుల వరి కోతలను, ధాన్యాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. దుకాణాల్లో ఎరువులు, విత్తనాలను పీఓఎస్ యంత్రంలో నమోదు చేసిన తర్వాతే కొనుగోలు చేయాలన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులను అందుబాటులో ఉంచాలని, లేకుంటే సకాలంలో ఎరువులు అందక దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని తెలిపారు. చేను పైనే గింజ ఆరేటట్లుగా చూడాలని.. దీంతో ఎక్కువ రోజులు కల్లాల్లో ఆరబెట్టే శ్రమ తగ్గుతుందని సూచించారు. పంట కోత సమయంలో 19 నుంచి 20 ఆర్‌పీఎం మధ్య బ్లోయర్ ఉంచాలని యజమాని, డ్రైవర్‌కు సూచించాలన్నారు. ప్రభుత్వం ఏ–గ్రేడ్ వరి ధాన్యం క్వింటాకు మద్దతు ధర రూ.2.320, కామన్ గ్రేడ్‌కు రూ.2,300తో పాటు రూ.500 బోనస్ చెల్లిస్తుందని వివరించారు. రైతులు ధాన్యం పూర్తిగా ఆరబెట్టిన తర్వాత కేంద్రాలకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ అరవింద్ పాల్గొన్నారు.



గజవాహనంపై విహరించిన దేవదేవుడు

శ్రీకురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి కురుమూర్తిస్వామి పద్మావతిదేవి సమేతంగా గజవాహనంపై ఊరేగారు. మంగళ వాయిద్యాలు, అర్చకుల వేదమంత్రోచ్చారణలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య దేవదేవుడు పల్లకీలో ఆసీనులై ఒంటి పాదం మెట్టు వరకు విహరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వరెడ్డి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

– చిన్నచింతకుంట

కురుమూర్తిరాయుడికి.. అమరచింత పట్టువస్త్రాలు



అమరచింత మార్కండేయస్వామి ఆలయంలో కురుమూర్తిస్వామి పట్టువస్త్రాలు తయారు చేస్తున్న చేనేత కార్మికులు (ఫైల్)

- పక్షం రోజులు కొనసాగిన వస్త్రాల తయారీ
- 6న కురుమూర్తి ఆలయానికి ఊరేగింపుగా తరలింపు

అమరచింత: భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న కురుమూర్తి రాయుడికి అమరచింత పట్టువస్త్రాలు సమర్పించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పక్షం రోజుల క్రితం పద్మశాలి కులస్తులు స్థానిక మార్కండేయస్వామి ఆలయంలో పట్టువస్త్రాల తయారీని ప్రారంభించారు. ఈ నెల 6న స్వామివారి అలంకారోత్సవం సందర్భంగా పట్టువస్త్రాలను సమర్పించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అమరచింత నుంచి పట్టువస్త్రాలను తలపై పెట్టుకొని కురుమూర్తిస్వామి ఆలయానికి తీసుకెళ్లేందుకు గాను ముగ్గురు కుల బంధువులను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేయనున్నారు. వారితో స్వామివారి సన్నిధి వరకు భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా పట్టువస్త్రాలను తీసుకెళ్లి సమర్పించనున్నారు.



స్వామివారి కోసం తయారు చేసిన పట్టువస్త్రాలు

ఇలవేల్పునకు పట్టు కానుక..

అమరచింత పద్మశాలి కులస్తుల ఇలవెల్పు కురుమూర్తి రాయుడికి ఎన్నో ఏళ్లుగా పట్టు వస్త్రాలు సమర్పిస్తూ వస్తున్నారు. గతంలో నూలుతో నేసిన వస్త్రాలను అందించే వారు. ప్రస్తుతం పట్టు అందుబాటులోకి రావడంతో స్వామివారికి పంచె, గౌను, అమ్మవారికి పట్టుచీరను స్వయంగా ప్రత్యేక మగ్గంపై నేసి సమర్పిస్తున్నారు.

గతంలో స్వామివారి పుష్కరిణిలోనే..

అరవై ఏళ్ల క్రితం అమరచింత పద్మశాలి కులస్తులు స్వామివారి పుష్కరిణిలో నీటిపై తేలాడే డ్రమ్ములపై ప్రత్యేకంగా మగ్గం ఏర్పాటుచేసి.. అక్కడే స్వామి, అమ్మవార్లకు వస్త్రాలను తయారు చేసే వారు. అప్పట్లో కోటకొండ కుర్మన్న, కొంగరి చిన్నయ్య, నరాల సింగోటం కోనేటిలోనే స్వామి వారికి వస్త్రాలను నేసి, భక్తిశ్రద్ధలతో స్వామి వారికి సమర్పించేవారు.

అదృష్టంగా భావిస్తున్నాం..



కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు ఇక్కడి నుంచి ఏటా పట్టువస్త్రాలను పంపించడం అనాదిగా వస్తున్న ఆచారం. అందులో భాగంగా 15 ఏళ్లుగా స్వామివారి పట్టువస్త్రాల నేత పనుల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నా.

– దేవరకొండ లచ్చన్న, పద్మశాలి సంఘం అధ్యక్షుడు

సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాం..



ఎన్నో ఏళ్లుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను కొనసాగించేందుకు పద్మశాలి కులస్తులందరి సహకారంతో ముందుకు సాగుతున్నాం. అప్పట్లో నూలు వస్త్రాలు అందించే వాళ్లం. ప్రస్తుతం పట్టు వస్త్రాలను తయారుచేసి స్వామి వారికి సమర్పిస్తున్నాం.

– మేర్వ రాజు, అమరచింత

నేడు అలంకారోత్సవం



స్వామివారి ఆభరణాలు

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి అలంకారోత్సవం నిర్వహించనున్నారు. అత్యంత వైభవంగా చేపట్టే ఈ ఉత్సవానికి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. ఆత్మకూర్‌లోని ఎస్‌బీఐ లాకర్‌లో భద్రపరిచిన స్వామివారి ఆభరణాలను అక్కడి నుంచి తీసుకువచ్చేందుకు ఆలయ కమిటీ సభ్యులు వెళ్లనున్నారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి.. మేళతాళాలు, బాణసంచా పేలుస్తూ ఊరేగింపుగా తరలివస్తారు. బ్యాంకు నుంచి ఆత్మకూర్ చెరువు కట్ట వరకు మధ్యనగాడి వంశస్థులు ఆభరణాలను తలపై పెట్టుకుని వస్తారు. అక్కడ శివుడికి పూజలు చేసిన తర్వాత పోలీసు భద్రత మధ్య మదనాపురం మండలంలోని కొత్తపల్లి, దుప్పల్లి గ్రామాల మీదుగా చిన్నచింతకుంట మండలం అమ్మాపురంలోని రాజా శ్రీరాంభూపాల్ ఇంటికి చేరుస్తారు. అక్కడ ఆనవాయితీ ప్రకారం గంటపాటు ప్రత్యేక పూజలు చేస్తారు. అమ్మాపురం నుంచి నంబి వంశస్థులు తలపై పెట్టుకొని అంబోరు మధ్యన కాలినడకన ఆభరణాలను కురుమూర్తి కొండలకు చేరుస్తారు. ఈ కార్యక్రమం కనుల పండువగా సాగుతుంది. స్వామివారి ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ప్రభుత్వ అధికారుల సమక్షంలో ఆభరణాలను ఆలయ పూజారులకు అందజేస్తారు. స్వామివారి కిరీటం, హస్తాలు, పాదుకలు, కోర మీసాలు, కెంపు, ముత్యాల హారం , కనకహారాలతో ఇతరత్రా ఆభరణాలు ఉంటాయి. వీటిని కాంచనగుహలో కొలువుదీరిన కురుమూర్తి స్వామికి అలంకరిస్తారు. ఈ సందర్భంగా కాంచన గుహ ప్రత్యేక శోభ సంతరించుకుంటుంది.

ఉత్సాహంగా మ్యాథ్స్-బీ పరీక్ష



మహబూబ్‌నగర్ మౌంట్ బాసిల్ స్కూల్‌లో 'సాక్షి' మ్యాథ్స్-బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు



కొల్లాపూర్ ఎల్లూరు అక్షర స్కూల్‌లో మ్యాథ్స్-బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/కొల్లాపూర్: విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెంచి, చతుర్విధ ప్రక్రియలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మ్యాథ్స్-బీ పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. తరగతుల వారీగా విద్యార్థులను వివిధ కేటగిరీలుగా విభజించి పరీక్ష నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మౌంట్ బాసిల్ పాఠశాలలో 250 మందికి పైగా, అపెక్స్ పాఠశాలలో 90 మందికి పైగా విద్యార్థులు మ్యాథ్స్-బీ పరీక్షలు రాశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు అక్షర స్కూల్‌లో నిర్వహించిన మ్యాథ్స్-బీ పరీక్షలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పరీక్షలను పాఠశాల కరస్పాండెంట్ నరేష్‌కుమార్, ప్రిన్సిపాల్ విజేందర్‌సింగ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ మనోభావాలను 'సాక్షి'తో పంచుకున్నారు. పరీక్షలో కఠినమైన ప్రశ్నలు వచ్చినప్పటికీ.. మెటీరియల్ చదవడం వల్ల ఎంతో సులువుగా సమాధానాలు రాశామన్నారు. తమ సిలబస్ నుంచి దాదాపుగా అన్ని ప్రశ్నలు మ్యాథ్స్-బీ పరీక్షలో వచ్చాయని చెప్పారు. ఈ పరీక్ష రాయడం వల్ల వార్షిక పరీక్షల్లో సులభంగా పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతామన్నారు. గణితం అంటే భయం కూడా చాలా వరకు తగ్గుతుందన్నారు.

సింపుల్ మెథడ్స్ అప్లై చేశా..



పరీక్షలో ఉన్న ప్రశ్నలకు తక్కువ సమయంలో సమాధానాలు రాయాల్సి ఉంటుంది. అందుకోసం ప్రతి ప్రశ్నకు కూడా సింపుల్‌గా సమాధానం రాసేందుకు మెటీరియల్‌లో ఉన్న మెథడ్స్ అప్లై చేశా. తద్వారా మంచి మార్కులు సాధిస్తాననే నమ్మకం ఉంది.

– చేతన్‌రాజ్, 9వ తరగతి, అపెక్స్ స్కూల్

బాగా రాశాను..



మ్యాథ్స్-బీ పరీక్ష కోసం కొన్ని రోజుల పాటు సిద్ధమయ్యాను. పరీక్షకు సంబంధించిన మెటీరియల్ చదవడంతో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాశాను. పరీక్ష రాయడం మంచి అనుభూతినిచ్చింది. ఈ పరీక్షతో సెల్ఫ్ కాన్ఫిడెన్స్ పెరిగింది. భవిష్యత్‌లో ఎటువంటి పరీక్ష అయినా సులువగా రాయగలను అనే నమ్మకం ఉంది.

– ఆరాధ్య, 6వ తరగతి, మౌంట్‌బాసిల్

పోటీ పరీక్షలపై అవగాహన..



ఎప్పుడూ పాఠశాలలో నిర్వహించే పరీక్షలను మాత్రమే రాసేవారం. కానీ మొదటి సారిగా రాసిన మ్యాథ్స్-బీ పరీక్షతో పోటీ పరీక్షలపై అవగాహన పెరిగింది. దాదాపుగా అన్ని అంశాలకు సంబంధించి ప్రశ్నలు వచ్చాయి. ప్రశ్నలకు చాలా సులువుగా జవాబులు ఇచ్చే విధంగా ఉంది.

– దీక్షిత, 7వ తరగతి, మౌంట్‌బాసిల్

మ్యాథ్స్‌పై పట్టుకోసం..



మ్యాథ్స్‌లో అన్ని అంశాలపై పట్టు సాధించేందుకు మ్యాథ్స్-బీ పరీక్ష రాస్తున్నా. ఇటువంటి పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తే, పబ్లిక్ పరీక్షల్లో కూడా రాణించేందుకు అవకాశం ఉంటుందని టీచర్లు చెప్పారు. దీంతో ఈ పరీక్షలో మంచి మార్కులు సాధించేందుకు మెటీరియల్‌తో సిద్ధమయ్యా. సింపుల్ మెథడ్స్ చాలా బాగున్నాయి.

– చరణ్, 10వ తరగతి, అపెక్స్ స్కూల్

విద్యార్థులకు ఎంతో ప్రయోజనం..



'సాక్షి' ఆధ్వర్యంలో కొన్ని సంవత్సరాలుగా మ్యాథ్స్-బీ పరీక్ష నిర్వహిస్తున్నారు. దీన్ని వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలగనుంది. సాధారణంగా మ్యాథ్స్ అంటే విద్యార్థులు భయపడతారు. కానీ ఇటువంటి పోటీ పరీక్షల వల్ల విద్యార్థులకు భయం తొలగి, మంచి మార్కులు సాధించే అవకాశాలు ఉన్నాయి.

– శిరీష ప్రవీణ్‌కుమార్, మేనేజింగ్ డైరెక్టర్, మౌంట్‌బాసిల్

గతంలో మంచి మార్కులు వచ్చాయి..



'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మ్యాథ్స్-బీ పరీక్షను గతంలో కూడా రాశాను. ఆ పరీక్షలో మంచి మార్కులు వచ్చాయి. దీంతో ఈ సంవత్సరం కూడా పరీక్ష రాసేందుకు సిద్ధమయ్యాను. మ్యాథ్స్ చేయడానికి వచ్చినప్పటికీ.. సులభ పద్ధతిలో వేగంగా ప్రశ్నలకు సమాధానాలను రాసే విధంగా మెటీరియల్‌లోని మెథడ్స్ ఉపయోగపడతాయి.

– హర్షిత, 7వ తరగతి, మౌంట్‌బాసిల్

క్రీడాకారులకు అండగా ఉంటాం



అండర్- 19 బాలుర జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, డీఈఓ రవీందర్



అండర్- 17 బాలికల జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, డీఈఓ రవీందర్

- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి
- రాచాలలో ముగిసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు
- అండర్- 17, 19 విజేతగా మహబూబ్‌నగర్ జట్లు
- విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే, శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి

అడ్డాకుల: క్రీడల్లో రాణించే గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు ప్రభుత్వం తరఫున వారికి అండగా ఉంటామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల మండలం రాచాలలో మంగవారం సాయంత్రం ముగిసిన 68వ ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికలు, అండర్- 19 బాలుర కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహబూబ్‌నగర్ బాల, బాలికల జట్లకు శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రతిభ కనబర్చే క్రీడాకారులకు సహకారం అందిస్తున్నారన్నారు. సీఎం కప్ ద్వారా ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జాతీయ స్థాయిలో రాణించేలా తోడ్పాటు నందిస్తామన్నారు. క్రీడల్లో రాణించే వారికి ఇచ్చే సర్టిఫికెట్లతో క్రీడల కోటా కింద ఉద్యోగాలు లభిస్తాయన్నారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం క్రీడలను పట్టించుకోలేదని విమర్శించారు. రాచాలలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నంబర్‌వన్ పాలసీ తెస్తాం..

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో నంబర్‌వన్ క్రీడా పాలసీని అమలు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడలకు రూ.371 కోట్లు కేటాయించారంటే క్రీడలకు ఆయన ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో అర్థమవుతుందన్నారు. క్రీడల్లో సత్తాచాటిన వారికి ప్రభుత్వం ద్వారా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో జిల్లా వాసే క్రీడల మంత్రిగా ఉన్నా ఇక్కడ పోటీలను ఏర్పాటు చేయించలేదని దుయ్యబట్టారు.

ఆతిథ్య జట్లే విజేతలు

రాచాలలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికలు, అండర్-19 బాలికల కబడ్డీ పోటీల్లో రెండు మహబూబ్‌నగర్ జట్లు విజేతలుగా నిలిచాయి. అండర్- 19 బాలుర విభాగం ఫైనల్ మ్యాచులో హైదరాబాద్ జట్టుపై గెలిచి మహబూబ్‌నగర్ జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో హైదరాబాద్, మూడో స్థానంలో వరంగల్ జట్లు నిలిచాయి. అలాగే అండర్- 17 బాలికల విభాగంలో ఖమ్మం జట్టుపై మహబూబ్‌నగర్ జట్టు ఉత్కంఠభరిత విజయం సాధించింది. రెండో స్థానంలో ఖమ్మం, మూడో స్థానంలో ఆదిలాబాద్ జట్టు నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, డీఈఓ రవీందర్‌లు బహుమతులు, మాజీ ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి మహబూబ్‌నగర్ బాలబాలికల జట్లకు నగదు అందజేశారు. పోటీలను విజయవంతం చేసిన ఎంఈఓ వి.కురుమూర్తి, మాజీ సర్పంచ్ తిరుపతయ్య, పీఈటీ రాజవర్ధన్‌రెడ్డిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏఎంఓ శ్రీనివాస్, నాయకులు అరవింద్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, తిరుపతయ్య, శ్రీహరి, రాధిక, నిర్వాహకులు పాపిరెడ్డి, కురుమూర్తిగౌడ్, ఫయాజొద్దీన్, రాజవర్ధన్‌రెడ్డి, వడెన్న, శ్రీనివాసులు, జగన్‌మోహన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్ స్వామినారాయణ్ గురుకుల్



విన్నర్ స్వామినారాయణ్ గురుకుల్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎన్‌పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో జరుగుతున్న 3వ జలజం సత్యనారాయణ టీ-10 క్రికెట్ టోర్నీ మంగళవారం ముగిసింది. టోర్నీలో చాంపియన్‌గా శ్రీస్వామినారాయణ గురుకుల్ జట్టు (జడ్చర్ల), రన్నరప్‌గా లిటిల్ స్కాలర్స్ (మహబూబ్‌నగర్) జట్టు, మూడోస్థానంలో జెడ్పీహెచ్‌ఎస్ నంచర్ల జట్టు నిలిచాయి. ఫైనల్ మ్యాచ్‌లో స్వామినారాయణ గురుకుల్ జట్టు 7 వికెట్ల తేడాతో లిటిల్ స్కాలర్స్ జట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన లిటిల్ స్కాలర్స్ స్కూల్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లకు 71 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీస్వామినారాయణ గురుకుల విద్యాలయం జట్టు 9 ఓవర్లలో 3 వికెట్లకు 71 పరుగులు చేసింది. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన జెడ్పీహెచ్‌ఎస్ నంచర్ల జట్టు 10 ఓవర్లలో 9 వికెట్లకు 73 పరుగులు చేయగా.. అనంతరం బ్యాటింగ్ చేసిన రెయిన్‌బో స్కూల్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లకు 61 పరుగులు చేశారు. టోర్నీలో మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా సాయిరాం (లిటిల్ స్కాలర్స్ స్కూల్), బెస్ట్ బ్యాట్స్‌మేన్‌గా కేతన్ (శ్రీస్వామి నారాయణ గురుకుల్), బెస్ట్ బౌలర్‌గా సయ్యద్ ఫైజాన్ (లిటిల్ స్కాలర్స్ స్కూల్) అందుకున్నారు. టోర్నీలో విన్నర్, రన్నర్, థర్డ్‌ప్లేస్ జట్లకు ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్‌పీ వెంకటేశ్ ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. ఇలాంటి టోర్నీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని తమ క్రీడానైపుణ్యాన్ని చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త లక్ష్మణ్‌గౌడ్, ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, వెంకటరామారావు, కోచ్ గోపాలకృష్ణ, కృష్ణమూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, పీడీ బాలరాజు, పీఈటీలు వినోద్‌కుమార్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ ఎంపికలు



గెలుపొందిన అథ్లెట్లతో దూమర్ల నిరంజన్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మంగళవారం ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17 విభాగాల బాల, బాలికలకు అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 200 మందికిపైగా బాల, బాలికలు హాజరయ్యారు. ఆయా విభాగాల్లో వీరికి 100 మీ., 200 మీ., 400 మీ., 600 మీ., 800 మీ., 1500 మీ., 3000 మీ., 3000 వాక్, 5000 వాక్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, ట్రిపుల్ జంప్, జావెలిన్‌త్రో, హార్డిల్స్, హ్యామర్‌త్రో అంశాల్లో పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి మాట్లాడుతూ త్వరలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. టీజీ పెటా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దూమర్ల నిరంజన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో క్రీడల పెద్దపీట వేస్తున్నారన్నారు. గ్రామీణస్థాయి క్రీడాకారులను ప్రోత్సహించడానికి త్వరలో సీఎంకప్ క్రీడలు జరగనున్నాయన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు ప్రతిభచాటాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న నూతన క్రీడా పాలసీలతో క్రీడలకు ఎంతో ప్రోత్సాహం లభిస్తుందన్నారు. నైపుణ్యం గల క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తుందన్నారు. జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగి జిల్లాకు పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీలు వేణుగోపాల్, ఆనంద్‌కుమార్, కృష్ణ, రమణ, మెర్సీ, మోయిన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠ పోరులో పాలమూరుదే విజయం

9 పరుగుల తేడాతో వరంగల్‌పై గెలుపు

మహబూబ్‌నగర్ క్రీడలు: వరంగల్‌లో జరుగుతున్న హెచ్‌సీఏ అండర్-23 వన్డే అంతర్ జిల్లా లీగ్ కం నాకౌట్ టోర్నమెంట్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు విజయం సాధించింది. వరంగల్‌లోని టీవీవీఎస్ క్రికెట్ గ్రౌండ్‌లో వరంగల్ జట్టుతో జరిగిన ఉత్కంఠ మ్యాచ్‌లో జిల్లా జట్టు 9 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు 22.3 ఓవర్లలో 81 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో షాదాబ్ అహ్మద్ 25 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వరంగల్ జట్టు జిల్లా బౌలర్ల ధాటికి 26.3 ఓవర్లలో 72 పరుగులకు ఆలౌట్ అయింది. జిల్లా బౌలర్ ముఖితుద్దీన్ 10 ఓవర్లలో 3 మెయిడిన్లు వేసి కేవలం 8 పరుగులకు ఇచ్చి 4 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఇతర బౌలర్లు ప్రణీత్‌రెడ్డి 2, అరవింద్, జస్వంత్ చెరో వికెట్ తీశారు. టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా జట్టు మూడో మ్యాచ్‌ను బుధవారం ఖమ్మం జట్టుతో తలపడనుంది.



విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టు

ఎండీసీఏ అభినందన

టోర్నీలో మ్యాచ్ గెలిచిన ఉమ్మడి జిల్లా జట్టును ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా అభినందించారు. రానున్న మ్యాచుల్లో ఇదే విధంగా సమష్టి ప్రతిభకనబరిచి చాంపియన్‌గా నిలవాలని ఆకాంక్షించారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం

జడ్చర్ల: బాలానగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన కలకలం రేపింది. సీఐ నాగార్జునగౌడ్ కథనం ప్రకారం.. బాలానగర్ మండలం మోతీఘనపూర్ గ్రామానికి చెందిన ఖలీమ్(45) తన తల్లిదండ్రులతో గొడవ పడి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో తల్లిదండ్రులను పిలిపించి విచారిస్తామని ఖలీమ్‌కు పోలీసులు చెప్పి పంపించారు. అయితే పోలీస్‌స్టేషన్ బయటకు వచ్చిన ఖలీమ్ పెట్రోల్ తీసుకుని గేటు ఎదుట ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. వెంటనే పోలీసులు గమనించి బకెట్లతో నీళ్లు పోసి మంటలు ఆర్పారు. ఈ ఘటనలో హోంగార్డు రాము సైతం మంటలు అంటుకుని స్వల్పంగా గాయపడ్డాడు. వెంటనే క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారించి చర్యలు చేపడుతామని సీఐ తెలిపారు.

మరో ఘటనలో..

బాలానగర్ చౌరస్తాలో జాతీయ రహదారిపై మంగళవారం ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య ప్రయత్నం చేసిన సంఘటన కలకలం రేపింది. మండలంలోని మాచారం తండాకు చెందిన వెంకట్‌నాయక్ బాలానగర్‌లోని చౌరస్తాలో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేయగా చుట్టుపక్కల దుకాణదారులు అడ్డుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని బాధితుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అయితే తనపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా పట్టించుకోకపోవడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు బాధితుడు చెప్పాడని స్థానికులు తెలిపారు. కాగా బాలానగర్‌లో ఉదయం ఒకరు, రాత్రి మరొకరు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య ప్రయత్నం చేయడం చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా

గుండెపోటుతో రైతు మృతి

- పొలం వద్ద పనులు చేస్తుండగా ఘటన



లక్ష్మయ్య (ఫైల్)

లింగాల: మండల కేంద్రానికి చెందిన గోదారి లక్ష్మయ్య(62) అనే రైతు పొలం పనులు చేస్తూ గుండెపోటుకు గురై మృతిచెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మయ్య వేరొకరి పొలాన్ని కౌలుకు తీసుకొని మొక్కజొన్నను సాగుచేశాడు. ధాన్యాన్ని ఆరబెట్టుటకు పొలం దగ్గర కల్లం చేస్తుండగా ఆకస్మాత్తుగా కుప్పకూలాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో రైతు కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపించింది. మృతుడికి భార్య వరలక్ష్మి, ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

దొంగలు దొరికారోచ్.!



చోరీ వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ లింగయ్య



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

- వెంబడించి పట్టుకున్న పోలీసులు
- 5.3 తులాల బంగారం, 35 తులాల వెండి
- రూ. 3.71 లక్షల వస్తువుల జప్తు

మరికల్: వరుస దొంగతనాలతో హడలేతిస్తున్న ఇద్దరు దొంగలు ఎట్టకేలకు దొరికారు. పోలీసులు వెంబడించి వారిని పట్టుకున్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో దొంగలను ప్రవేశపెట్టిన డీఎస్పీ లింగయ్య వివరాలను వెల్లడించారు. మరికల్‌కు చెందిన మూడవత్ హన్మంతు అనే వ్యక్తి దీపావళి పండుగకు ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ఉన్నా బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి ఈ నెల 2న హైదరాబాద్ నుంచి మరికల్‌కు వచ్చారు. ఇంటి తాళం విరగొట్టి ఉండటం చూసి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. మూడు మాసాల బంగారు కమ్మలు, 20తులాల వెండి పట్టీలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ ఘటనపై బాధితుడి మరికల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దొంగలను పట్టుకోవడం కోసం ఇద్దరు పోలీసులతో కూడిన ఒక స్పెషల్ క్రైమ్ టీమ్‌ను ఏర్పాటుచేసి దొంగల కదలికలపై కన్నేశారు. పాత నేరస్తుడైన మక్తల్ మండలం చందాపూర్‌కు చెందిన తమ్మిరెడ్డి మంగళవారం మరికల్ బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతూ క్రైమ్ టీమ్ పోలీసులను చూసి పరుగులు పెట్టాడు. పోలీసులు చేజింగ్ చేసి దొంగను పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా మక్తల్ మండలం వద్వాడుకు చెందిన కోల్పూర్ నరసింహతో కలిసి దొంగతనం చేసినట్లు తెలిపారు. నరసింహను కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేయగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు.

గతేడాది రెండు ఇళ్లలో..

కోల్పూర్ నరసింహ గతేడాది పూసల్‌పహాడ్ గ్రామంలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరబడి బీరువా లాకర్‌ను పగలగొట్టి బంగారపు కమ్మ బుట్టలు, వెండి వస్తువులు, రూ. 20వేలు చోరీ చేశాడు. మరికల్‌లో తాళం వేసిన ఓ ఇంట్లో బీరువాలో ఉన్న బంగారు మకర కొందనలు, బుట్టలు, ఉంగరం, చైన్, గుండ్లు, 2 బంగారు గాజులతో పాటు రూ.5వేలను ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకున్నాడు. ఈ మూడు నేరాలను ఒప్పుకోవడంతో వద్వాడు గ్రామంలో అతని ఇంట్లో దాచిన మూడు కేసులకు సంబంధించిన ఆభరణాలను చూపించాడు. వాటిలో 5.3తులాల బంగారం, 35తులాల వెండి, మొత్తం వాటి విలువ రూ. 3.71లక్షల విలువ చేసే ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. చాక్యచక్యంతో దొంగలను పట్టుకున్న క్రైమ్ టీమ్ పోలీసులు తిరుపతిరెడ్డి, రవీందర్‌లను డీఎస్పీ అభినందించి రివార్డ్ అందజేసి అభినందించారు. పట్టుబడ నిందితులను నారాయణపేట కోర్టుకు రిమాండ్ చేసినట్లు డీఎస్పీ లింగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్‌ఐ మురళీలు పాల్గొన్నారు.

జూరాలకు పెరిగిన ఇన్‌ఫ్లో

- ప్రాజెక్టుకు 15వేల క్యూసెక్కుల వరద
- జెన్‌కో రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి
- 16,696 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

ధరూరు : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు మరింత తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం ప్రాజెక్టుకు 11వేల 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మంగళవారం సాయంత్రం వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లోలు 15వేల 500 క్యూసెక్కులకు తగ్గినట్లు అధికారులు తెలిపారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో రెండు యూనిట్లలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 15,074 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. ఆవిరి రూపంలో 72 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 820 క్యూసెక్కులు, కుడి కాలువకు 730 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 16,696 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.624 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

శ్రీశైలంలో నీటిమట్టం 879.3 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం నీటిమట్టం 879.3 అడుగుల వద్ద 184.2774 టిఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 15,074క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 8,892 మొత్తం 23,966 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తున్నాయి. శ్రీశైలంలో భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 15,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,519, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 7.915 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

సుంకేసులకు కొనసాగుతున్న వరద

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుండి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మంగళవారం ఎగువ నుంచి 11,510 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా.. రెండు గేట్లను తెరిచి 8,892క్యూసెక్కులను దిగువకు వదిలారు. కేసీ కెనాల్ కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.